క్లుప్తంగా

నేడు మండల సమావేశం

మర్రిపూడి: మండల సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ జగదీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావాలని కోరారు.

20న జాబ్‌మేళా

సింగరాయకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 20న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణాభివృద్ధి అధికారి జె.రవితేజ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో పేటీఎం, కీర్తి మెడికల్స్, డెలివరీ డాట్ కాం, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, టాటా ఎలక్ట్రానిక్స్ ప్పైడర్ ఎలక్ట్రిక్, ఎస్బీఐ కార్డ్స్ వంటి కంపెనీలు పాల్గొంటాయన్నారు. రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటుందని, నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

సింగరాయకొండ: దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి ఎస్ మధుసూదనరావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి తరువాత పాకల ఆదిఆంధ్ర కాలనీలో దోమల నివారణపై అవగాహన కల్పించారు. దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని, దోమలు ఉత్పత్తి కాకుండా మురుగునీరు నిల్వ ఉండకుండా, కొబ్బరిబొండాలు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

పామూరు: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉం



దోమల నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

టే వ్యాధులు దరిచేరవని వైద్యాధికారి డాక్టర్ ఎ.రవళి ప్రియాంక అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా ఎన్‌జీఓ కాలనీలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ మురికినీటి నిల్వలు లేకుండా చూడటం ద్వారా దోమలు అరికట్టవచ్చన్నారు. ఎస్‌యూఓ సీహెచ్‌వీ రామాంజనేయులు, ఎంపీహెచ్ఈఓ ఎన్ బ్రహ్మానందం, ఆరోగ్య కార్యకర్త సాత్తు మౌనిక, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బంగారు బాల్యంపై శిక్షణ



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శ్రీనివాసులరెడ్డి

కనిగిరిరూరల్: బంగారు బాల్యం యాప్‌పై ఒక్క రోజు శిక్షణ స్థానిక పవిత్ర కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహిచంచారు. నోడల్ అధికారి వి.గిరిధర్ శర్మ, సార్ప్ సంస్థ పీడీ సునీల్, నాగార్జున వివిధ అంశాలను వివరించారు. ఆర్డీఓ బి.కేశవర్ధన్‌రెడ్డి, డీఎల్‌డీఓ శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్, ఐసీడీఎస్ పీడీ ఎస్ సువర్ణ, తహసీల్దార్ ఏవీ రవిశర్మ, ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ పాల్గొన్నారు.


రామారావుకు ఘన సన్మానం



మాట్లాడుతున్న డాక్టర్ శివరామిరెడ్డి

సింగరాయకొండ: మండలంలో ఉత్తమ పంచాయతీ అధికారిగా మూలగుంటపాడు పంచాయతీ కార్యదర్శి రామారావు గుర్తింపు పొందారని సర్పంచ్ డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి కొనియాడారు. మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి రామారావు బదిలీ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీపీఓ వెంకట నాయుడు, సీఐ సిహెచ్ హజరత్తయ్య, ఒంగోలు డీఎల్‌పీఓ పద్మ, ఎంపీడీఓ డి.జయమణి, ఈఓఆర్‌డీ రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న అధికారులు

కందుకూరు రూరల్: వరల్డ్ విజన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేసింది. కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ కమిషనర్ అనూష మాట్లాడుతూ పేద విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బంది లేకుండా సైకిళ్లు పంపిణీ చేయడం హర్షించదగ విషయమన్నారు. డిప్యూటీ డీఈఓ పీవీ.నరసింహారావు, ఎంఈఓ కె.సుబ్బారెడ్డి, సంస్థ మేనేజర్ కె.యేషయ, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వై.పుల్లయ్య పాల్గొన్నారు.

పొగాకు రైతులు ఐక్యంగా ఉద్యమించాలి

● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి

కొండపి:

రోజు రోజుకూ పతనమవుతున్న ధరలపై పొగాకు రైతులు ఐక్యంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం పొగాకు రైతులతో సమావేశమై మాట్లాడారు. పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ధరల సమస్యపై ఈ నెల 20వ తేదీన ఒంగోలు మల్లయ్య లింగం భవనంలో నిర్వహించే రైతు సదస్సుకు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. పొగాకు ఉత్పత్తి ఖర్చులు పెరిగి ధరలు తగ్గిపోవడంతో రైతులు నష్టాల బాట పట్టారన్నారు. గత రెండేళ్లుగా మంచి ధరలు రావడంతో సన్న, చిన్న కారు రైతులు కూడా మిగిలిన పంటలకు ధరలు లేక ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో పొగాకు సాగు చేశారని తెలిపారు. దీంతో గత ఏడాదితో పోలిస్తే ఉత్పత్తి ఖర్చులు భారీగా పెరిగాయన్నారు. బ్యార్నీకి రూ.5 లక్షల వరకు అదనంగా ఖర్చయినట్లు తెలిపారు. గత ఏడాది క్వింటా రూ.36 వేలకు కొనుగోలు చేస్తే ఈ ఏడాది రూ.28 వేలకే కొనుగోలు చేస్తున్నారని, లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయకపోవడంతో రైతులంతా నష్టాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటా పొగాకు సరాసరి ధరలు రూ.264 నుంచి రూ.243లకు పడిపోయినట్లు తెలిపారు. పొగాకు కంపెనీలు సిండికేట్‌గా మారి రకరకాలు కుంటి సాకులు చెప్పుకుంటూ పొగాకు ధరలను దిగ్గోసి కొనుగోలు చేస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారని తెలిపారు. రైతులు పోరాడి సాధించుకున్న పొగాకు బోర్డు సైతం వివిధ రూపాల పేరుతో పెనాల్టీలు వసూలు చేస్తూ రైతుల నడ్డి విరుస్తుందన్నారు. పొగాకు బోర్డు రైతులకు డబ్బు చెల్లింపులు తప్ప గిట్టుబాటు ధరలు ఇప్పించడంలో విఫలమైందన్నారు. ఎక్సైజ్ డ్యూటీ రూపంలో పొగాకు రైతుల నుంచి లక్షల కోట్ల రూపాయలు ఆదాయం పొందుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు రైతుల పట్ల ప్రకటనలు చేయడం తప్ప చేసింది ఏం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు ఏకమై ఉద్యమాలు చేసి ధరలు సాధించుకోవడం తప్ప వేరే మార్గం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు వ్యాపారులతో చర్చించి రైతులు పండించిన పొగాకు పంటకు గిట్టుబాటు ధరలు ఇప్పించాలన్నారు. ఈ క్రమంలో ఈ నెల 20న జరిగే రైతు సదస్సుకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి రైతులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆర్ లక్ష్మి, బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి

చెవిరెడ్డికి నాయకుల సంఘీభావం

● టంగుటూరు టోల్ ప్లాజా వద్ద భారీగా చేరిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

టంగుటూరు: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని బెంగళూరు విమానాశ్రయంలో పోలీసులు అక్రమ అరెస్టు చేసి బుధవారం విజయవాడ తీసుకుని పోతుండగా మార్గం మధ్యలో టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద ఆయనకు సంఘీభావం తెలిపేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నాయకులను, కార్యకర్తలను చెదరగొట్టారు. దీంతో చెవిరెడ్డిని తీసుకెళ్తున్న వాహనాలు టోల్‌ప్లాజా వద్ద ఆపకుండా వెళ్లిపోయాయి. సంఘీభావం తెలిపేందుకు వచ్చిన వారిలో పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వైఎస్సార్ సీపీ టంగుటూరు మండల పార్టీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, జరుగుమల్లి మండల పార్టీ అధ్యక్షుడు పిన్నిక శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీ పటాన్ రియాజ్, సింగరాయకొండ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, సనగర కోటి, దేవరపల్లి వరుణ్, కొమ్ము సురేంద్ర, కసుకుర్తి నవీన్, విజయ్, తదితర నాయకులు ఉన్నారు.



టంగుటూరు టోల్ ప్లాజా వద్దకు చేరుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆలస్యంగా ప్రారంభమైన పొగాకు వేలం



కొండపిలో వేలం నిర్వహిస్తున్న నిర్వహణ అధికారి సునీల్‌కుమార్



టంగుటూరులో వేలం

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం సాంకేతిక లోపంతో వేలం ఆలస్యంగా ప్రారంభమైనట్లు నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. వేలం కేంద్రంలో పొగాకు బేళ్లను కేజీలను కొలిచే కాటా మరమ్మతులకు గురైందని, ఒంగోలు నుంచి నిపుణును పిలిపించి మరమ్మతులు చేయించి వేలాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే వేలం బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైంది. దాదాపు నాలుగు గంటల ఆలస్యంగా వేలం ప్రారంభం కావడంతో వేలానికి వచ్చిన 900 బేళ్లలో కేవలం 360 బేళ్లను మాత్రమే పరిగణలోకి తీసుకొని వేలాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మిగిలిన బేళ్లను రేపటి వేలంలో కొనుగోలు చేస్తామన్నారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.179పలికింది. క్లస్టర్ పరిధిలోని కట్టవారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు వేలానికి బేళ్లను తీసుకువచ్చారు. వివిధ కారణాలతో 53 బేళ్లను తిరస్కరించారు. 17 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో బుధవారం జరిగిన వేలంలో పొగాకు సరాసరి ధర కేజీ రూ. 234.68కు పడిపోయింది. పొందూరు క్లస్టర్ గ్రామాలకు చెందిన రైతులు 811 బేళ్లను తీసుకురాగా 589 బేళ్లను కొనుగోలు చేసి 222 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.180 పలికింది. వేలంలో 22 మంది వ్యాపారులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

గిట్టుబాటు ధర కల్పించాలి

కనిగిరిరూరల్: పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దేవర సుబ్బారెడ్డితో కలిసి సందర్శించారు. పొగాకు రైతుల సమస్యలపై ఈనెల 20న ఒంగోలులో జరిగే సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, పి కొండయ్య, వాసు, సీహెచ్ పవన్ కళ్యాణ్, ఎస్‌కే ఖాశింపీరా పాల్గొన్నారు. తొలుత వేలం నిర్వాహణ అధికారి కోటేశ్వరావును కలిసి గిట్టుబాటు ధర, లో గ్రేడ్ బేళ్ల కొనుగోళ్ల విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

తహసీల్దార్‌గా మహ్మద్ హుస్సేన్ బాధ్యతల స్వీకరణ



షేక్.మహ్మద్ హుస్సేన్

సీఎస్‌పురం(పామూరు): తహసీల్దార్‌గా షేక్.మహమ్మద్ హుస్సేన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయన బదిలీపై సీఎస్‌పురం తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

80శాతం రాయితీతో డ్రోన్లు



మాట్లాడుతుతున్న ఏడీఏ అనసూయ

కందుకూరు రూరల్: ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడితే 80 శాతం రాయితీపై డ్రోన్లు అందజేస్తున్నట్లు ఏడీఏ పి.అనసూయ తెలిపారు. మండలంలోని ఓగూరులో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు మందులు, ఎరువులు వేసుకునేందుకు త్వరతగతిన పని జరిగేందుకు, ఖర్చు తగ్గించుకునేందుకు, కూలీల కొరతను నివారించుకునేందుకు ఈ డ్రోన్ ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయాధికారి షేక్.అబ్దుల్ రహీమ్, వీఏఏ శరత్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం



ఆదిమూలపు సురేష్



దద్దాల నారాయణ యాదవ్



డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి

సింగరాయకొండ:

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమల్లో భాగంగా అక్రమ కేసులు బనాయించి వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటు ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అక్రమ అరెస్టుకు పాల్పడిందని పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఒక ప్రకటనలో ఖండించారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులపై కక్షసాధింపు చర్యలు, వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఏదో ఒక కారణం చూపి కేసులు బనాయించి అక్రమ అరెస్టుకు పాల్పడటం అలవాటుగా మారిందన్నారు. చెవిరెడ్డికి వ్యతిరేకంగా బలవంతంగా సాక్ష్యాలు సృష్టించే క్రమంలో అతని గన్‌మెన్ ఎన్ మదన్‌రెడ్డిని చిత్రహింసలకు గురి చేశారని, గన్‌మన్ రాతపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తుంటే పోలీసులు అక్రమంగా అరెస్టులు చేసుకుంటూ పోతున్నారన్నారు. ఇష్టరీతిన వ్యవహరిస్తున్న పోలీసులకు రానున్న రోజుల్లో జైళ్లు కూడా సరిపోవని హెచ్చరించారు. మద్యం కుంభకోణం అంటూ లేనిపోనివి సృష్టించి నేతలను భయభ్రాంతులకు గురిచేయడం తదగని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కూటమి ప్రభుత్వ అక్రమాలపై ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

☛ వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని అరెస్టు అక్రమమని పార్టీ ఇంటలెక్చువల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. జగనన్న ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై నమోదు చేసిన అక్రమ కేసుతో వేధింపులకు పాల్పడటమే లక్ష్యంగా అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలతో కూటమి ప్రభుత్వం కుట్రకు తెరలేపిందన్నారు. చెవిరెడ్డి అరెస్టు ఈ కుట్రలో భాగమేనని పేర్కొన్నారు.

☛ చెవిరెడ్డి భాస్కరరెడ్డి అరెస్టు ముమ్మాటికీ రాజకీయ కక్ష్య సాధింపు చర్య అని పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు కనపర్తి శేషారెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డు పెట్టుకుని వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురిచేస్తుందని ఆరోపించారు.

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్టు దుర్మార్గమైన చర్య అని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం పాలనను గాలికి వదిలి అక్రమ అరెస్టులు, అక్రమ కేసులు బనాయిస్తూ రాజకీయ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడటాన్ని తీవ్రంగా విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై రెడ్‌బుక్ కుట్రతో .. అక్రమ కేసులను నమోదు చేసి వేధింపు చర్యలకు పాల్పడటం సరైంది కాదన్నారు. అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలతో అక్రమంగా అరెస్టు చేశారన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం కాకుండా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ నేతలను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ విధానాలను అందరం సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ప్రజలే కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారన్నారు.

☛ వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్ట్ కేవలం రెడ్‌బుక్ కుట్రేనని పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా మండిపడ్డారు. కూటమి నేతల దుష్ట పాలనను ప్రజలంతా గమనిస్తున్నారని, సరైన సమయంలో బుద్ధి చెబుతారన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏఓ రవికుమార్



పీసీపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

హనుమంతునిపాడు: రైతులు భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలని వ్యవసాయాధికారి వి.రవి కుమార్ అన్నారు. మండలంలోని కొండారెడ్డిపల్లి, కోటతిప్పల పంచాయతీలో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. కొండారెడ్డిపల్లిలో నిమ్మ తోటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు ఉపయోగం , పంటలు సాగు చేస్తే రైతులు ఆశించిన దిగుబడి సాధించవచ్చన్నారు. కౌలు రైతులు కౌలు కార్డుల కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది గోపి కృష్ణ, ఖాధీర్, సాయి, రైతులు కొండయ్య పాల్గొన్నారు.

పీసీపల్లి: పచ్చిరొట్ట విత్తనాలతో ఎంతో ఉపయోగమని ఏడీఏ వెంకట రమణ అన్నారు. మండల పరిధిలోని గుదేవారిపాలెం, పెద అలవలపాడులో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చయించుకోవాలన్నారు. ఏఓ రంగకృష, సిబ్బంది పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: మండలంలోని పోలినేనిపాలెం, వలేటివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి శేషారెడ్డి మాట్లాడుతూ విత్తనశుద్ధితో తెగుళ్లను నివారించవచ్చన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రవీంద్ర, నాగరాజు, సురేష్, రైతులు పాల్గొన్నారు.

కొండారెడ్డికి వైఎస్సార్ సీపీ నేతల నివాళి



కొండారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పొన్నలూరు: మండలంలోని చెరువుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జడ్డు కృష్ణారెడ్డి తండ్రి కొండారెడ్డి దశదిన కర్మకు జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యాచరణ కార్యదర్శి కాటా మాధవరావు, మాజీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గడ్డం మాల్యాద్రి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గొడపేరు విజయ్‌కుమార్, సర్పంచ్ అనుమోలు ప్రసాద్, జేసీఎస్ మాజీ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, కంచర్ల రాము, చిడిపోతు రమేష్, మాదాల శ్రీను, దరిమడుగు కొండలరావు పాల్గొన్నారు.

కూలి బకాయిలు విడుదల చేయాలి



కూలీలతో మాట్లాడుతున్న కేజీ మస్తాన్

మర్రిపూడి: ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కేజీ మస్తాన్ డిమాండ్ చేశారు. మర్రిపూడిలో ఉపాధి కూలీలు చేస్తున్న పని ప్రదేశాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలి అందక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కష్టజీవుల పట్ల పాలకులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కూలీలకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, నీడకోసం పట్టలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలని డిమాండ్ చేశారు.

ఉపాధి పనుల పరిశీలన

వలేటివారిపాలెం: మండలంలోని కలవళ్ల గ్రామంలో ఉపాధి హామీ పనులను మండల ఏపీఓ దయసాగర్ బుధవారం పరిశీలించారు. ముందుగా మస్టర్ రికార్డులు పరిశీలించారు. మస్టర్ ప్రకారం కూలీలు హాజరవుతున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. కూలీలు సమయపాలన పాటించేలా ఫీల్డ్ అసిస్టెంట్లు చూసుకోవాలన్నారు. కొలతలు ప్రకారం పనిచేసిన వారికే మస్టర్లు వేయాలని సూచించారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. కూలీలు కూడా వీలైనంత త్వరగా పనులు ముగించుకోని వెళ్లాలన్నారు.

చిరుధాన్యాల ఆహారం తీసుకోవాలి



ఉచితంగా చిరుధాన్యాలను పంపిణీ చేస్తున్న డీన్, అధ్యాపకులు

కందుకూరు రూరల్: చిరుధాన్యాల ఆహారం తీసుకోవాలని అసోసియేట్ డీన్ వి.విజయభాస్కర్ అన్నారు. మండలంలోని మహదేవపురం గ్రామంలోని సచివాలయంలో ఓగూరు గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో రైతులకు చిరుధాన్యాల సాగు, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ గురించి బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీన్ మాట్లాడుతూ చిరుధాన్యాలతో ఆహారం తయారు చేసుకొని తీసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఉద్యాన కళాశాల సహాయ అధ్యాపకులు ఎం.సంఘమిత్ర, కె.సాయి మనోజ్ఞ, ఎం.పవిత్ర, గ్రామ వ్యవసాయాధికారి, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓగా నాగూర్‌వలి

మర్రిపూడి: నూతన డిప్యూటీ ఎంపీడీఓగా షేక్ నాగూర్‌వలి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలంలో డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.